



APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ : నరేంద్ర

గుంటూరు | సంపుటి : 1 | సంచిక : 58 | పేజీలు : 8 | బుధవారం 25 ఫిబ్రవరి 2026 | వెల : 4/-


## ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మహిళా--పురుష అభ్యర్థులకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ మార్చి 9 నుంచి గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు.

2లో

## తిరుమలలో కల్తీ నెయ్యి

# కుట్ర

తిరుమలలో శ్రీవారి ప్రసాదంగా భక్తులకు అందే లడ్డూ నాణ్యతను దెబ్బతీసేలా సాగిన కల్తీ నెయ్యి వ్యవహారం యాదృచ్ఛికం కాదని, ఇది ఒక పద్ధతి ప్రకారం అమలైన రాజకీయ--ఆర్థిక కుట్ర అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ఘాటుగా వ్యాఖ్యానించారు. 2019--24 మధ్య టెండర్ నిబంధనలను సడలించి, నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలేయడం ద్వారా కోట్ల రూపాయల దోపిడీ జరిగిందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. సిట్, ల్యాబ్ రిపోర్టులు, కోర్టు ఆదేశాలు--ఝశ్రీశ్రీ కల్తీని నిర్ధారించాయని స్పష్టం చేశారు. ఇది దేవాలయాల పవిత్రతను దిగజార్చే ప్రయత్నమేనని, బాధ్యులపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని సీఎం తేల్చిచెప్పారు. హిందూ మనోభావాల రక్షణకు ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందన్నది ఆయన స్పష్టం చేసారు...

- దేవాలయాలపై దాడుల పరంపర...
- తిరుమల అపచారం వెనుక రాజకీయ కుట్ర
- కల్తీ నెయ్యి వ్యవహారాన్ని సభలో సీఎం చంద్రబాబు
- హిందూ ధర్మంపై దాడులకు కూటమి ప్రభుత్వం గట్టి చెక్



**అమరావతి రక్షణ బ్యూరో**

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదానికి వినియోగించిన నెయ్యిలో జరిగిన కల్తీ వ్యవహారం వెనుక యాదృచ్ఛిక తప్పిదం కాదని, ఇది ఒక పద్ధతి ప్రకారం సాగిన భారీ కుట్ర అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో స్పష్టంగా ఆరోపించారు. లఘు చర్చలో భాగంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో మాట్లాడిన సీఎం, 2019--24 మధ్య కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన పరిణామాలను వరుసగా సభ ముందుంచారు. నెయ్యి టెండర్ల నుంచి ల్యాబ్ రిపోర్టుల దాచివేత వరకు, లంచాల వ్యవహారాల నుంచి దేవాలయాలపై దాడుల వరకు–అన్నీ ఒకే రాజకీయ స్కీమ్‌లో భాగమేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రసాదం అంటే భక్తుడికి దైవానుగ్రహం అని, అలాంటి పవిత్ర ప్రసాదాన్ని కల్తీ చేయడం మహా అపచారం అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. “ఎవరికి ఏ కష్టం వచ్చినా వేంకటేశ్వర స్వామిని మొక్కుకుని ఆయనతోనే చెప్పుకుంటాం. 2019 నుంచి 2024 మధ్య శ్రీవారికి

- మిగతా 2లో



## ఇళ్ల పథకంలో రూ.6 వేల కోట్ల కుంభకోణం

### మంత్రి అనగాని

వైసీపీ పాలనా కాలంలో పేదలందరికీ ఇళ్లు పథకం పేరుతో భారీ అక్రమాలు జరిగాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ఇళ్ల పట్టాల పంపిణీలో వేలాది మంది అనర్హులకు లబ్ది చేకూర్చినట్లు శాసనసభలో తెలిపారు.

వివరాలు 2లో..



## పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల సమగ్రాభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలతో ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి. ప్రజల సమస్యల పరిష్కారం లక్ష్యంగా మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటన చేపట్టారు.

2

## బాధ్యతగా ఉండాలి

### ప్రజల సమస్యలకు వేదికగా ‘రక్షణ’ దినపత్రిక ఆరంభం

### కలెక్టర్ వినోద్ కుమార్





## ఉత్సాహంగా ప్రారంభమైన ఏపీ లెజిస్లేచర్స్ స్పోర్ట్స్ మీట్-2026

ప్రజా ప్రతినిధుల మధ్య ఐక్యత, మానసిక ఉల్లాసానికి వేదికగా నిలిచే ఏపీ లెజిస్లేచర్స్ స్పోర్ట్స్ మీట్--2026 విజయవాడలో ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడా ఉత్సవాలను శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ప్రారంభించారు.



## తిరుమల లడ్డూ అంశంపై చంద్రబాబు, పవన్ అబద్ధాలు

తిరుమల లడ్డూ అంశాన్ని రాజకీయంగా మలచేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అసెంబ్లీలో పనిగట్టుకొని అబద్ధాలు చెప్పారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పేర్ని నాని తీవ్ర ఆరోపణలు చేశారు.



## తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి

# మహా అపచారం

### దోషులకు శిక్ష తప్పదు : పవన్ కళ్యాణ్

హిందూ ధర్మంపై దాడి జరిగినప్పుడు భాష, కులం, ప్రాంతాలకు అతీతంగా ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడటం అత్యంత తీవ్రమైన నేరమని శాసనసభలో స్పష్టం చేశారు

2



## శ్రీకాకుళం డయేరియా ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష

శ్రీకాకుళం నగరంలో డయేరియా వ్యాప్తిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని, వ్యాధి మరింత వ్యాపించకుండా కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.





## మార్చి 2న హైదరాబాద్‌కు రాహుల్ గాంధీ

## ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ

**రక్షణ న్యూస్, గుంటూరు**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల యువతకు కేంద్ర రక్షణ సేవల్లో చేరేందుకు మరో గొప్ప అవకాశంగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ మార్చి 9 నుంచి ప్రారంభం కానుంది. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ వెల్లడించారు. మార్చి 9, 10 తేదీల్లో మహిళా అభ్యర్థులకు, మార్చి 12, 13 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ పురుష అభ్యర్థులకు, మార్చి 15, 16 తేదీల్లో తెలంగాణ పురుష అభ్యర్థులకు ర్యాలీ నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎలాంటి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అవసరం లేకుండా నేరుగా ర్యాలీకి హాజరుకావచ్చని అధికారులు స్పష్టం చేశారు. నిర్దేశిత వయోపరిమితి, విద్యార్హతలు, శారీరక ప్రమాణాలు పూర్తి చేసిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లు, గుర్తింపు పత్రాలతో ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య ర్యాలీ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు శారీరక పరీక్షలు, పరుగు, రాత పరీక్షల ద్వారా తుది ఎంపిక జరుగుతుందని తెలిపారు.

## పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

**రక్షణ న్యూస్ అమరావతి**

పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీలను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రణాళికలు సిద్ధం చేయిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించడం, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పట్టాలెక్కించడం ప్రధాన లక్ష్యంగా ప్రతిపాదనలు రూపొందుతున్నాయి. పారిశుద్ధ్యం, ముంపు సమస్యల నివారణ, మౌలిక వసతుల కల్పన, స్థానిక సంస్థల ఆదాయం పెంపు వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల అధికారుల బృందం మంగళవారం పిఠాపురం నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించింది. అందుబాటులో ఉన్న వనరులు, వివిధ పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి పనులు ప్రారంభించే అవకాశాలపై అధికారులు సమగ్ర అధ్యయనం చేశారు. పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించి, వాటిని ప్రాధాన్యాల వారీగా పరిష్కరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

**ఏలేరు కాలువ ముంపు సమస్యపై దృష్టి**

పిఠాపురం నియోజకవర్గంలో ఏలేరు కాలువ మూడు పాయలుగా ప్రవహిస్తుండగా, ముఖ్యంగా చెరుకుల కాలువ ముంపు సమస్య ప్రజలను ఇబ్బంది పెడుతోంది. జనవరి 10న సంక్రాంతి సందర్భంగా పిఠాపురం పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి ఈ సమస్యను స్థానికులు తీసుకువచ్చారు. కాలువ స్వరూపాన్ని స్వయంగా పరిశీలించిన ఆయన, సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని అధికారులకు సూచించారు. దీంతో కల్వర్టు నిర్మాణం సహా ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రైల్వే పైవంతెన ప్రతిపాదనల నేపథ్యంలో మరో పరిష్కార మార్గాన్ని కూడా పరిశీలిస్తున్నారు.

**మురుగు నీటి శుద్ధి, ఆగిపోయిన పనుల పునఃప్రారంభం**

పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో లారీల యార్డు, మసీదు మన్యం ప్రాంతాల్లో ప్రతిపాదించిన రెండు మురుగు నీటి ట్రీట్మెంట్ ప్లాంట్లను మళ్లీ ముందుకు తీసుకెళ్లే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో నిధుల లేమితో నిలిచిపోయిన ఈ పనులను తిరిగి ప్రారంభించి పట్టణ మురుగునీటిని శుద్ధి చేసేలా అంచనాలు రూపొందిస్తున్నారు. అలాగే ఆర్ఆర్బీహెచ్ఆర్ కళాశాల స్థలంలో మధ్యలో నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని పరిశీలించి, ఖేలో ఇండియా పథకం కింద మళ్లీ ప్రారంభించే అవకాశాలపై చర్చించారు.

**గొల్లప్రోలులో డంపింగ్ యార్డు సమస్య**

గొల్లప్రోలు నగర పంచాయతీలో డంపింగ్ యార్డు సమస్య కీలకంగా మారిందని అధికారులు గుర్తించారు. నగర పంచాయతీ భవనం శిథిలావస్థలో ఉన్నట్లు, డంపింగ్ యార్డు కోసం సుమారు రూ.2.50 కోట్లతో స్థల కొనుగోలు అవసరమని స్థానిక అధికారులు వివరించారు. ప్రత్యామ్నాయంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ద్వారా ఆదాయం పెంచే అవకాశాలు, రోడ్లు, పార్కులు, డ్రైన్ల అభివృద్ధిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

**బుధవారం డైరెక్టర్ స్థాయి సమీక్ష**

క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలపై సమీక్షించేందుకు బుధవారం రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ సంచాలకులు డా. సంపత్ పిఠాపురం రానున్నారు. 'పాడ' కార్యాలయంలో జరిగే ఈ సమీక్షలో పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల అధికారులు పాల్గొని, చేయాల్సిన పనులు, నిధుల కేటాయింపు, ప్రాధాన్యాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించనున్నారు

## ఉత్సాహంగా ప్రారంభమైన ఏపీ లెజిస్లేచర్స్ స్పోర్ట్స్ మీట్--2026

**రక్షణ న్యూస్ అమరావతి**

ప్రజా ప్రతినిధులకు క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక చురుకుదనానికి దోహదపడతాయని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే--ఎమ్మెల్సీ క్రీడా ఉత్సవాలు--2026ను మంగళవారం విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆయన ప్రారంభించారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజుతో కలిసి క్రీడా జ్యోతి ప్రజ్వలన, స్పోర్ట్స్ ఫ్లాగ్, జాతీయ జెండా, అసెంబ్లీ జెండా ఆవిష్కరణలతో ఈ క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఈ వేదిక పూర్తిగా క్రీడల కోసమేనని, ఇందులో రాజకీయాలకు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజల సమస్యలు, పరిపాలనా పనులు, శాసనసభ సమావేశాలతో ఒత్తిడిలో ఉంటారని, అటువంటి వారికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మంచి ఉపశమనాన్ని ఇస్తాయని అన్నారు. 1983లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రజా ప్రతినిధుల కోసం క్రీడా పోటీలను ప్రారంభించారని గుర్తు చేశారు. ఆ సంప్రదాయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ క్రీడలను మళ్లీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత శాసనసభలో దాదాపు 78 శాతం మంది యువ ఎమ్మెల్యేలు ఉన్నారని, వారి ఉత్సాహమే ఈ పోటీలకు మరింత బలంగా నిలుస్తోందని స్పీకర్ పేర్కొన్నారు. ఈ పోటీలు ప్రజా ప్రతినిధులకే పరిమితం కాదని, ప్రజలు కూడా వచ్చి వీక్షించి తమ ప్రతినిధులను ప్రోత్సహించాలని కోరారు. తన చిన్నతనంలో వాలీబాల్ ఆడేవాడినని, ఆ ఆటను చూసిన దివంగత ఎన్టీ రామారావు తనను రాజకీయాల్లోకి ఆహ్వానించారంటూ తన అనుభవాలను పంచుకున్నారు. క్రీడల ముగింపు రోజున ఎమ్మెల్యేలు కుటుంబ సభ్యులతో కలిసి రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారని, ఆ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతి ప్రధానోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ, ఎన్టీ రామారావు హయాంలో ప్రారంభమై మధ్యలో నిలిచిపోయిన ఈ క్రీడా సంప్రదాయాన్ని తిరిగి ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. పార్టీలు, వ్యక్తుల మధ్య ఉండే భేదాభిప్రాయాలను మర్చిపోయి అందరూ కలిసి మెలిసి ఉండేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. గ్రామీణ క్రీడలు, పాఠశాల స్థాయిలో క్రీడల ప్రాధాన్యతను మళ్లీ గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ, స్పీకర్ ఆదేశాల మేరకు ఈ క్రీడా పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను స్పోర్ట్స్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో శాప్ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనవ్యవస్థ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్, డిప్యూటీ స్పీకర్ కే. రఘురామకృష్ణం రాజు, ప్రభుత్వ విప్‌లు జీవీ ఆంజనేయులు, పి. అనురాధ, శాప్ వీసీ ఒ ఎండీ ఎస్. భరణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తిరుమలలో కల్తీ నెయ్యి కుట్ర

-మొదటిపేజీ తరువాయి

ఎన్నో అపచారాలు జరిగాయి. వాటిపై పోరాడితే మాపైనే కేసులు పెట్టి వేధించారు" అని గుర్తుచేశారు. రామతీర్థంలో రాముడి విగ్రహం తల నరికిన ఘటనను ప్రస్తావిస్తూ, అక్కడికి వెళ్లిన తనపైనా కేసులు పెట్టారని తెలిపారు.

**నెయ్యి టెండర్ల మార్పుతో మొదలైన కల్తీ కథ**

కల్తీ నెయ్యి వ్యవహారం ఎలా మొదలైందో సీఎం సభలో కూలంకుషంగా వివరించారు. 2020 జనవరి--ఫిబ్రవరి మధ్య నెయ్యి టెండర్ నిబంధనలను మార్చి నాణ్యత ప్రమాణాలను తగ్గించారని ఆరోపించారు. రోజుకు లక్షల లీటర్ల పాల సేకరణ సామర్థ్యం, డైరీ అనుభవం, టర్నోవర్ వంటి కఠిన నిబంధనలను గాలికి వదిలేయడంతో అనర్హ కంపెనీలకు టెండర్లు దక్కాయని తెలిపారు. అప్పుడే నెయ్యి నాణ్యతపై ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోలేదన్నారు.

2019--24 మధ్య కాలంలో మొత్తం 59.71 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని, ఇందుకు సుమారు రూ.234 కోట్ల ఖర్చు చేశారని సీఎం వెల్లడించారు. ఈ కల్తీ నెయ్యితో సుమారు 20.01 కోట్ల లడ్డూలు తయారై భక్తులకు విక్రయించబడినట్టు వివరించారు. "ల్యాబ్‌ల కన్నుగప్పి టెండర్లు దక్కించుకున్నారు. నకిలీ సర్టిఫికెట్లతో టీటీడీకి మకిలీ తెచ్చారు" అని మండిపడ్డారు.

**ల్యాబ్ రిపోర్టుల దాచివేత... వ్యవస్థాపిత నిర్లక్ష్యం**

ఈ వ్యవహారంలో అత్యంత తీవ్రమైన అంశం---ల్యాబ్ రిపోర్టుల దాచివేత. 2022లో సీఎఫ్టీఆర్ఐ ల్యాబ్ ఇచ్చిన నివేదికలో బీటా సిటోస్టెరాల్‌తో నెయ్యి కల్తీ జరిగిందని తేలినా, ఆ నివేదికను అప్పటి టీటీడీ ఛైర్మన్ తొక్కిపెట్టారని సీఎం ఆరోపించారు. భోలేబాబా సంస్థపై వచ్చిన ఫిర్యాదులపై కూడా చర్యలు తీసుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీలో ప్రక్షాళన చర్యలు ప్రారంభించామని, నెయ్యి శాంపిల్స్ తీసుకుని ఎన్డీడీబీకి పంపామని తెలిపారు. 2024 జూలై 23న వచ్చిన ఎన్డీడీబీ రిపోర్టులో యానిమల్ ఫ్యాట్ ఉన్నట్టు స్పష్టంగా తేలిందని చెప్పారు. "ఈ రిపోర్ట్ ఆధారంగానే నేను కల్తీ నెయ్యి విషయం మాట్లాడాను. నివేదికలే చాలా క్లియర్‌గా కల్తీ జరిగిందని చెప్పాయి" అని స్పష్టం చేశారు.

**సిట్ దర్యాప్తు... లంచాల బండారం బయటకు**

కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వచ్చాక సిట్ వేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం తెలిపారు. అయితే దీనిపైనా ఛాలెంజ్ చేసి సుప్రీంకోర్టుకు వెళ్లారని, చివరకు సిట్‌ను సీబీఐ ఆధ్వర్యంలో కొనసాగించాలని కోర్టు ఆదేశించిందన్నారు. సిట్ దర్యాప్తులో అనేక కీలక ఆధారాలు లభించాయని చెప్పారు. అప్పటి టీటీడీ ఛైర్మన్ పీఏ చిన్నప్పన్న రూ.4.5 కోట్ల లంచం తీసుకున్నట్టు తేలిందని, నకిలీ సర్టిఫికెట్లతో టెండర్లు దక్కించుకున్నారని తెలిపారు. కల్తీ నెయ్యి తయారీలో మోనోగ్లిసరైడ్, ఎసిటిక్ యాసిడ్ వంటి రసాయనాలు వినియోగించినట్టు ఆధారాలు లభించాయని, లంచాల వివరాలతో కూడిన డైరీలు కూడా సిట్ స్వాధీనం చేసుకుందని చెప్పారు. ఏఆర్ డైరీ నుంచే కల్తీ నెయ్యి సరఫరా జరిగినట్టు దర్యాప్తులో తేలిందన్నారు.

కల్తీ నెయ్యితో పాటు అన్యమత ప్రచారం ఆరోపణలు

కల్తీ నెయ్యి వ్యవహారం ఒకటైతే,

తిరుమలలో అన్యమత ప్రచారం మరో కుట్రగా సీఎం ఆరోపించారు. తిరుమలకు వెళ్లే ఆర్టీసీ బస్సు టికెట్లపై 'జెరుసలేం యాత్ర' ముద్రించడం, తిరుమలలో అన్యమత ప్రచారం జరగడం, పింక్ డైమండ్ చోరీ అంటూ తనపై దుష్ప్రచారం చేయడం---ఇవన్నీ శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలో భాగమేనని చెప్పారు.

టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని, 85 మంది సభ్యులతో పాలక మండలి ఏర్పాటు చేశారని ఆరోపించారు. హైకోర్టు తప్పుపట్టడంతో ఆ జీవోను వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు. పరకామణిలో చోరీ జరిగితే రాజీ ప్రయత్నాలు చేశారని, దేవదేవుడి హుండీలో చోరీ జరిగితేనూ చులకనగా మాట్లాడారని విమర్శించారు.

**దేవాలయాలపై దాడుల పరంపర**

2019--24 మధ్య కాలంలో మొత్తం 2,032 దేవాలయాలపై దాడులు జరిగాయని సీఎం సంచలన ఆరోపణ చేశారు. విగ్రహాల ధ్వంసం, రథాల దగ్ధం, వెండి సింహాల చోరీ వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని చెప్పారు. రామతీర్థం, అంతర్వేది, బిట్రగుంట ఘటనలను ఉదాహరణగా పేర్కొన్నారు. "నిందితులపై సరైన చర్యలు తీసుకోలేదు. మా హయాంలో దేవాలయాలపై దాడులకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం" అని స్పష్టం చేశారు. 2005 నుంచే హిందువులపై దాడులు మొదలయ్యాయని, అప్పటి పాలనలో ఏడు కొండలను రెండు కొండలుగా పరిమితం చేసే ప్రయత్నం జరిగిందని సీఎం ఆరోపించారు. ఈ నిర్ణయంపై దేశవ్యాప్తంగా హిందువులు తిరగబడితేనే వెనక్కి తగ్గారని చెప్పారు. ఉడిపి పేజావర్ మఠం విశ్వేశ్వర తీర్థ స్వామీజి డిమాండ్ మేరకు ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు చేయగా, తిరుమలతో పాటు విద్యాసంస్థల్లో అన్యమత ప్రచారం జరుగుతోందని ఆ కమిటీ నివేదిక ఇచ్చిందని తెలిపారు.

**హెరిటేజ్ అంశంపై స్పష్టీకరణ**

నెయ్యి వ్యవహారాన్ని హెరిటేజ్ డెయిరీతో ముడిపెట్టే ప్రయత్నం జరిగిందని సీఎం ఆరోపించారు. "హెరిటేజ్ మా కుటుంబ వ్యాపార సంస్థ. ఇప్పటివరకు ఒక్క కేజీ నెయ్యిని కూడా ప్రభుత్వ శాఖలు కొనుగోలు చేయలేదు. ప్రభుత్వ సహకారం లేకుండానే హెరిటేజ్ నిలబడింది" అని స్పష్టం చేశారు. ఇందాపూర్ డెయిరీ కో-మాన్యుఫాక్చరింగ్ మాత్రమే చేస్తుందని, హెరిటేజ్‌తో నెయ్యి విషయంలో ఎలాంటి సంబంధం లేదన్నారు.

**ప్రక్షాళన చర్యలు... భక్తుల సంతృప్తి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీటీడీలో ప్రక్షాళన చర్యలు ప్రారంభించామని సీఎం వివరించారు. లడ్డూ ప్రసాద నాణ్యతను పెంచామని, ఫుడ్ సేఫ్టీ ధృవీకరణ తర్వాతే ముడి పదార్థాలు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. అన్నప్రసాదం పాత విధానాన్ని తిరిగి అమల్లోకి తెచ్చామని, 98 శాతం మంది భక్తులు నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. దర్శనాల నిర్వహణ, వసతి కేటాయింపులు, క్యూమేనేజ్‌మెంట్‌లో మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. 60 టీటీడీ దేవాలయాల్లో రూ.700 కోట్లతో అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామని, దేశవ్యాప్తంగా 200 దేవాలయాల జీర్ణోద్ధరణతో పాటు 5 వేల కొత్త ఆలయాల నిర్మాణానికి ప్రణాళికలు ఉన్నాయని ప్రకటించారు. "హిందూ మనోభావాలను కాపాడేందుకు పూర్తి బాధ్యత తీసుకుంటాం" అని సీఎం తేల్చిచెప్పారు.

రాజకీయంగా కీలక మలుపు

తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలలో ఇది కీలకంగా రాజకీయాల్లో కీలక మలుపుగా మారింది. ఇది కేవలం అవినీతి కేసు మాత్రమే కాదు---మత విశ్వాసాలు, పాలనా బాధ్యత, రాజకీయ నైతికత అన్నింటినీ ప్రశ్నించే అంశంగా నిలిచింది. బాధ్యత ఎవరిది? క్షమాపణ ఎవరు చెప్పాలి? అన్న ప్రశ్నలే ఇప్పుడు రాజకీయ వేదికపై మార్మోగుతున్నాయి.

## ఇళ్ల పథకంలో రూ.6 వేల కోట్ల కుంభకోణం

**రక్షణ అమరావతి, ఫిబ్రవరి 24:**

వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలందరికీ ఇళ్లు పథకం పేరుతో సుమారు రూ.6 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. మంగళవారం శాసనసభలో టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. గత ప్రభుత్వం ఇళ్ల పట్టాల పేరుతో 22 లక్షల మందికి లబ్ధి చేకూర్చినట్లు ప్రకటించినప్పటికీ, అందులో దాదాపు 7 లక్షల మంది ఇప్పటివరకు కన్వేయన్స్ డీడ్లు కూడా తీసుకోలేదని మంత్రి తెలిపారు. ఇళ్ల పట్టాల కోసం నివాసయోగ్యం కాని పల్లపు భూములు, శ్మశానాలు, ఊరికి దూరంగా ఉన్న భూములు, వర్షాలకు మునిగిపోయే ప్రాంతాలను సేకరించి, వాటికి రెండింతలు, మూడింతలు అధిక ధరలు చెల్లించారని విమర్శించారు. ఇళ్ల పట్టాలు నివాసయోగ్యంగా లేకపోవడంతో సుమారు రెండున్నర లక్షల మంది లబ్ధిదారులు వాటిని స్వీకరించేందుకు నిరాకరించినట్లు తెలిపారు. ఇళ్ల పట్టాల పంపిణీలో అక్రమాలపై తమ ప్రభుత్వం విచారణ చేపట్టగా 43,948 మంది అనర్హులు ఉన్నట్లు తేలిందన్నారు. ఇంకా 1,11,037 మంది లబ్ధిదారుల వివరాలు పరిశీలనలో ఉన్నాయని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నిజమైన న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఇళ్ల పథకాన్ని పునఃసమీక్షించామని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల భూమిని ఇళ్ల కోసం ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. అయితే గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర, పట్టణాల్లో సెంటు మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అందరికీ ఇళ్లు పథకం కింద మొత్తం 4,08,876 దరఖాస్తులు అందాయని మంత్రి వెల్లడించారు. వీటిలో 1,03,494 దరఖాస్తులను ఆమోదించగా, 1,41,928 దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. ఇంకా 1,56,454 దరఖాస్తులు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. ఇళ్ల పథకం పూర్తిగా పారదర్శకంగా, అర్హులైన పేదలకే లబ్ధి చేకూరేలా అమలు చేస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ శాసనసభకు స్పష్టం చేశారు.

## మార్చి 2న హైదరాబాద్‌కు రాహుల్ గాంధీ

**రక్షణ న్యూస్ డెస్క్**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మార్చి 2న హైదరాబాద్‌కు రానున్నారు. హైదరాబాద్ చేరుకున్న అనంతరం అనంతగిరిలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ శిక్షణా తరగతులకు ఆయన హాజరవుతారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులతో రాహుల్ గాంధీ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ భేటీలో పార్టీ బలోపేతం, రానున్న రాజకీయ సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అలాగే రెండు రాష్ట్రాల్లోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, సంస్థాగత నిర్మాణం, కేడర్‌ను మరింత బలోపేతం చేసే అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరగనుంది. రాహుల్ గాంధీ పర్యటనతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనగా, ఈ సమావేశం పార్టీకి కీలక మలుపుగా మారనుందని నాయకులు అభిప్రాయపడుతున్నారు.

## తిరుమల లడ్డూ అంశంపై చంద్రబాబు, పవన్ అబద్ధాలు:

**అమరావతి:రక్షణ న్యూస్** తిరుమల లడ్డూ ప్రసాదం అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అసెంబ్లీలో కావాలనే అసత్యాలు ప్రచారం చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పేర్ని నాని ఆరోపించారు. దేవుడు అంటే పవన్ కళ్యాణ్‌కు భయం, భక్తి లేవని వ్యాఖ్యానించారు. తిరుమల లడ్డూ అంశాన్ని హిందూ ధర్మంపై దాడిగా చిత్రీకరించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో దేవాలయాలపై దాడులు జరిగితే దాని ద్వారా ఎవరికీ లబ్ధి జరుగుతుందన్న ప్రశ్నను పేర్ని నాని లేవనెత్తారు. పాపభీతి లేకుండా టీడీపీ ప్రభుత్వాలు ఆలయాలను కూల్చివేశాయని ఆరోపించారు. గోదావరి పుష్కరాల సమయంలో జరిగిన ఘటనల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్లక్ష్యం వల్ల 29 మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. సింహాచలం ఆలయంలో గోడ కూలి ఏడుగురు మృతి చెందడంలో అప్పటి ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. కూటమి ప్రభుత్వ అసమర్థత కారణంగా తిరుపతిలో ఆరుగురు భక్తులు మృతి చెందారని, శ్రీకాకుళం కాశీబుగ్గ ఆలయంలో తొమ్మిది మంది చనిపోయారని గుర్తు చేశారు. తిరుమలలో వేయికాళ్ల మండపాన్ని కూల్చింది టీడీపీ ప్రభుత్వమే కాదా అని ప్రశ్నించారు. విజయవాడలో చంద్రబాబు హయాంలో కూల్చివేసిన ఆలయాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పునర్నిర్మాణం చేయించారని పేర్ని నాని తెలిపారు. దేవాలయాల పరిరక్షణపై టీడీపీ, జనసేన నేతలు మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించిన పేర్ని నాని, తిరుమల లడ్డూ అంశాన్ని రాజకీయం చేయడం మానేసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఇది పూర్తిగా రాజకీయ లబ్ధి కోసమే చేస్తున్న ప్రచారమని, ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

## తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి మహా అపచారం:

**అమరావతి, రక్షణ న్యూస్ :**

భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడటం అత్యంత తీవ్రమైన నేరమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ మహా అపచారానికి పాల్పడిన బాధ్యులకు తప్పకుండా శిక్ష పడుతుందని, ఈ కేసులో దోషులను కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని ఆయన హెచ్చరించారు. మంగళవారం శాసనసభలో తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై జరిగిన చర్చలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేయడానికి ప్రణాళికాబద్ధమైన కుట్ర జరిగిందని పవన్ కళ్యాణ్ ఆరోపించారు. నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు (ఎన్డీడీబీ) నివేదికలో నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని పేర్కొనగా, సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణలో నెయ్యిలో అసలు నెయ్యే లేదని తేల్చినట్లు తెలిపారు. పామాయిల్‌తో పాటు ఇతర రసాయనాలు కలిపి నకిలీ నెయ్యి తయారు చేసినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డూ తయారీకి సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి వాడినట్లు సిట్ విచారణలో తేలిందని చెప్పారు. 2019--2024 మధ్యకాలంలో దాదాపు 11 కోట్ల మంది భక్తులు తిరుమల దర్శించుకోగా, ఆ కాలంలో మొత్తం 48.76 కోట్ల లడ్డూలు విక్రయించారని తెలిపారు. ఇందులో సుమారు 20.10 కోట్ల లడ్డూలు నకిలీ నెయ్యితో తయారయ్యాయని టీటీడీ రికార్డులు చెబుతున్నాయని పేర్కొన్నారు. ఈ లడ్డూల్లో లక్ష లడ్డూలు అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి కూడా పంపిణీ చేశారని తెలిపారు. ఈ తప్పుకు గత టీటీడీ పాలక మండలిదే పూర్తి బాధ్యత అని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నియమించిన పాలక మండలి చేసిన తప్పులకు వారే జవాబుదారీ అని, అయినా కొందరు వారిని వెనకేసుకొస్తుండటం అర్థం కావడం లేదన్నారు. కల్తీ జరిగిందని అంగీకరించి చర్యలు తీసుకోవాలని కోరితే సమస్య ఉండదని, కానీ అస్సలు కల్తీ జరగలేదని చెప్పడమే ఇంత పెద్ద చర్చకు దారి తీసిందని వ్యాఖ్యానించారు. సిట్ విచారణలో నెయ్యి సరఫరా కోసం నిబంధనలు మార్చి, నచ్చిన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టినట్లు తేలిందని తెలిపారు. నెయ్యి సరఫరా సంస్థకు ఉండాల్సిన కనీస టర్నోవర్, పాల సేకరణ, అనుభవం, వెన్న తయారీ సామర్థ్యం వంటి అర్హతలను కావాలనే తగ్గించారని ఆరోపించారు. భోలే బాబా అనుబంధ సంస్థలైన మాల్ గంగా, వైష్ణవి డెయిరీలు పాల నుంచి ఒక్క లీటరు నెయ్యి కూడా తయారు చేయలేదని సిట్ ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. హిందూ ధర్మంపై దాడి జరిగినప్పుడు ముక్తకంఠంతో ఖండించకపోతే ఇలాంటి పరంపరలు కొనసాగుతూనే ఉంటాయని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. ఇతర మతాలకు ఇలాంటిది జరిగితే దేశమంతా స్పందిస్తుందని, కానీ హిందువుల విషయంలో మౌనం పాటించడం సరికాదన్నారు. హిందూ ధర్మం గురించి మాట్లాడడం తేలిక అన్న భావన మారాలని ఆయన అన్నారు. భగవంతుడి డబ్బును దోచుకునే వారి తరాలే లేచిపోతాయని, అటువంటి పాపానికి పాల్పడిన వారు ఎంతవరకు ఈ వ్యవహారాన్ని సాగదీస్తే అంతగా వారి పాపం పెరుగుతుందని పవన్ కళ్యాణ్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారం కేవలం పరిపాలనా తప్పు కాదని, ఇది హిందూ ధర్మంపై జరిగిన మహా అపచారమని ఆయన స్పష్టం చేశారు.

## బాధ్యత గా ఉండాలి

**రక్షణ న్యూస్ బాపట్ల**

బాపట్ల జిల్లాలో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే లక్ష్యంతో ప్రారంభమైన మన రాజధాని 'రక్షణ' తెలుగు దినపత్రికను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పత్రికను ఆవిష్కరించిన ఆయన, సమాజంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలను నిజాయితీగా వెలుగులోకి తీసుకువచ్చి, పాలకులకు చేరవేయడమే బాధ్యతాయుత జర్నలిజం లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. వాస్తవాలకు కట్టుబడి, ప్రజా ప్రయోజనాన్ని కేంద్రంగా చేసుకుని పనిచేసే పత్రికలే ప్రజల విశ్వాసాన్ని సంపాదించగలవన్నారు. అలాంటి దిశలో 'రక్షణ' దినపత్రిక ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం--ప్రజల మధ్య వారధిగా మీడియా వ్యవహరించాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడే విధంగా కథనాలు ఉండాలని సూచించారు. సమాజ హితాన్ని దృష్టిలో పెట్టుకుని సానుకూల మార్పుకు తోడ్పడే పాత్రికేయతను 'రక్షణ' కొనసాగించాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# కేరళమ్‌గా కేరళ రాష్ట్రం పేరు

కేరళ రాష్ట్రం పేరును 'కేరళమ్'గా మార్చాలన్న ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి మండలి మంగళవారం ఆమోదం తెలిపింది. నూతన పీఎంఓ కాంప్లెక్స్ 'సేవా తీర్థ్'లో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.



'కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన తరువాత, భారత రాష్ట్రపతి 'కేరళ పేరు మార్పు బిల్లు, 2026'ను కేరళ రాష్ట్ర శాసనసభకు పంపిస్తారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం, కేరళ రాష్ట్రం తన అభిప్రాయాన్ని తెలియజేసేందుకు ఈ ప్రక్రియను చేపడతారు. కేరళ శాసనసభ అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాత, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి సిఫారసుతో పార్లమెంట్?లో కేరళ పేరు మార్పు బిల్లు- 2026ను ప్రవేశపెడుతుంది' అని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

వాస్తవానికి కేరళ పేరును 'కేరళం'గా మార్చాలని కోరుతూ 2024 జూన్ 24న కేరళ శాసనసభ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. "మలయాళం భాషలో రాష్ట్రం పేరు 'కేరళం'. 1956 నవంబర్ 1న భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడ్డాయి. కేరళ పిరవి దినం కూడా నవంబర్ 1నే జరుగుతుంది. వాస్తవానికి స్వాతంత్ర్య పోరాట కాలం నుంచే మలయాళం మాట్లాడే వారందరికీ కలిపి 'ఐక్య కేరళం' కావాలనే డిమాండ్ బలంగా ఉండేది. అయితే రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్?లో మాత్రం 'కేరళ' అని నమోదు చేశారు. అందుకే ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం" అని 2024లో చేసిన ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

### రాష్ట్రాల పేర్లు ఇలా మార్చవచ్చా?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, ఇప్పటికే ఉన్న రాష్ట్రాల పేర్లను మార్చే అధికారం పార్లమెంట్?కు ఉంటుంది. అయితే ఇలాంటి బిల్లును రాష్ట్రపతి సిఫారసు లేకుండా పార్లమెంట్?లో ప్రవేశపెట్టడానికి వీల్లేదు. అంతేకాదు సంబంధిత రాష్ట్ర శాసనసభకు ఆ బిల్లును పంపి నిర్ణీత సమయంలోగా అభిప్రాయాలను కోరాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే కేరళ రాష్ట్రం పేరు మార్పు అంశాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిశీలించింది. కేంద్ర హోం మంత్రి అమిత్? షా ఆమోదంతో డ్రాఫ్ట్ కేబినెట్ నోట్?ను న్యాయవ్యవహారాల శాఖ, శాసన సభ విభాగాలకు, న్యాయమంత్రిత్వ శాఖలకు పంపారు. వారు కూడా ఈ ప్రతిపాదనకు తమ సమ్మతిని తెలియజేశారు.

### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

మంగళవారం కేంద్ర కేబినెట్ కేరళ పేరు మార్పుతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా బాలికలందరికీ ఉచితంగా హెచ్?పీవీ వ్యాక్సినేషన్ చేయించాలని తీర్మానించింది. అలాగే 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్దాసిల్ ఇంజెక్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. మరోవైపు శ్రీనగర్?లో రూ.1667 కోట్లతో ఎయిర్?పోర్ట్ నిర్మాణానికి, రూ.1667 కోట్లతో అహ్మదాబాద్ మెట్రో విస్తరణకు ఆమోదం తెలిపింది. అలాగే విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించింది.

### కేరళన్, కేరళైట్ పదాల మాటేమిటి?

కేరళ పేరును కేరళంగా మార్చడంపై కాంగ్రెస్ నేత శశిథరూర్ తనదైన రీతిపై స్పందించారు. రాష్ట్రం పేరును మారిస్తే అక్కడి ప్రజలను పిలిచే 'కేరళైట్?', 'కేరళన్?' లాంటి పదాల పరిస్థితి ఏమిటని సరదాగా ప్రశ్నించారు. 'కేరళం' వాసులను ఇకపై ఏమని పిలవాలి? అని చమత్కరించారు. వాస్తవానికి దీనిని కేబినెట్ నిర్ణయానికి ముందే ఎక్స్? వేదికగా ఆయన ఓ పోస్టు పెట్టారు. "ఇదంతా మంచిదే. కానీ ఇంగ్లీష్? మాట్లాడే మనలాంటి వారికి కోసం, భాషకు సంబంధించిన ఓ ప్రశ్న వేస్తాను. కేరళ ప్రజలను 'కేరళైట్'?, 'కేరళన్'? అనే పదాలతో పిలుస్తారు. రాష్ట్రం పేరును కేరళం అని మారిస్తే, అప్పుడు అక్కడి ప్రజలను 'కేరళమైట్' అంటారు. ఇదోదే సూక్ష్మజీవి పేరులా ఉంది. ఇక 'కేరళమియన్?' అంటే ఏదో అరుదైన ఖనిజం పేరులా అనిపిస్తోంది. ఈ పేరు మార్పు వల్ల పుట్టుకొచ్చే కొత్త పదాల కోసం కేరళ ముఖ్యమంత్రి ఓ పోటీని నిర్వహించాలేమో!"

### రాజాజీ విగ్రహం ఏర్పాటుపై హర్షం

మరోవైపు సోమవారం రాత్రి శశిథరూర్?, రాష్ట్రపతి భవన్?లో సి.రాజగోపాలాచారి (రాజాజీ) విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. భారత్ గణతంత్ర రాజ్యంగా మారకముందు, (రాష్ట్రపతి పదవి ఏర్పడక ముందు) గవర్నర్ జనరల్‌గా పనిచేసిన ఏకైక భారతీయుడు రాజాజీ అని ఆయన గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే ఆయన స్వతంత్ర పార్టీ సిద్ధాంతాలకు తాను బలమైన మద్దతుదారుడనని చెప్పారు. ప్రభుత్వ జోక్యం వంటగది, పడకగది, గ్రంథాలయాల వరకు ఉండకూడదనే ఆయన దృఢమైన భావాలను శశిథరూర్ కొనియాడారు. నేడు ఆయనను అనుసరించేవారు తక్కువ మంది ఉండడం విచారకరమని వ్యాఖ్యానించారు.

# రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా అమెరికాతో ట్రేడ్ డీల్

యుద్ధ నిర్ణయాల నుంచి అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వరకు అన్ని అంశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశ భద్రత, రైతుల ప్రయోజనాలు, పార్లమెంటరీ వ్యవస్థ అన్నీ ప్రమాదంలో పడుతున్నాయని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వేదికగా జరిగిన రైతు మహాచౌపాల్ సభలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.



### ప్రధాని స్పందించలేదు: రాహుల్

మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే తన పుస్తకంలోని చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన రాహుల్, చైనా ట్యాంకులు సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు ఆదేశాల కోసం రక్షణ మంత్రికి ఫోన్ చేసినా స్పందన రాలేదని నరవణే రాశారని చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఎవరూ స్పందించలేదని ఆయన పేర్కొన్నారని తెలిపారు. చివరికి యుద్ధ నిర్ణయం ప్రధాని తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రధాని స్పందించలేదని, ఆర్మీ చీఫ్‌ను ఒంటరిగా వదిలేశారని రాహుల్ వ్యాఖ్యానించారు. యుద్ధం చేయాలా వద్దా అన్నది రాజకీయ నిర్ణయమని, అది సైన్యానికి మోపలేమని స్పష్టం చేశారు.

### వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా అమెరికాతో ఒప్పందం!

ఇక ఇండో-- యూఎస్ ట్రేడ్ ఒప్పందంపై కూడా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాతో కుదిరిన ఈ ఒప్పందం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమని, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా ఉందని చెప్పారు. ఐదు నెలల పాటు వ్యవసాయ ఉత్పత్తుల అంశం కారణంగా ఈ ఒప్పందం నిలిచిపోయిందని, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రభుత్వం కూడా అంగీకరించలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ నుంచి బయటకు వెళ్లి నేరుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్?కు ఫోన్ చేసి ఒప్పందానికి సిద్ధమని చెప్పారని ఆరోపించారు.

### ఎప్‌స్టీన్ ఫైళ్ల వెనుక అనుమానాలు

"నాలుగు నెలలు ఏమీ జరగలేదు. ఒక్కసారిగా ప్రధాని కాల్ చేసి రైతులను అమ్మేశారు. గార్మెంట్ రంగాన్ని కూడా నష్టపరిచారు. దేశ డేటాను అమెరికాకు అప్పగించారు" అంటూ విమర్శించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రధానికి సవాల్ విసిరారు. అమెరికాలో ఎప్?స్టీన్? కేసుకు సంబంధించిన లక్షల ఫైళ్లు ఉన్నాయని, అవి వెలుగులోకి రాకపోవడం వెనుక కూడా అనేక అనుమానాలు ఉన్నాయని రాహుల్ అన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా అదానీ పేరే వినిపిస్తోందని, ఆ సంస్థ కేవలం కంపెనీ కాదని, బీజేపీ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా మారిందని ఆరోపించారు. "అమెరికా సుప్రీం కోర్టు నిర్ణయం తర్వాత ఇతర దేశాలు యూఎస్?తో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని నిర్ణయించు కున్నాయి. కానీ ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. ఈ వేదిక నుంచి నేను మోదీని సవాలు చేస్తున్నా. అమెరికా సుప్రీంకోర్టు ఈ ఒప్పందంపై తీర్పు ఇచ్చిన తర్వాత, అమెరికాతో ఒప్పందాన్ని రద్దు చేయండి. ట్రంప్ ఒత్తిడి కారణంగా ఆయన ఒప్పందాన్ని రద్దు చేయలేరు. భారత్?లో అత్యధిక జనాభా, అత్యధిక డేటా ఉంది. కానీ ప్రధాని మోదీ మన డేటా మొత్తాన్ని అమెరికాకు ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి లేకపోతే, ఆయన ఇలా చేసి ఉండేవారు కాదు. తన ఇమేజ్‌ను, రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి ఆయన భారతదేశాన్ని అమ్మేశారు" అని రాహుల్ ఆరోపించారు.

### ప్రజలతో కలిసి పోరాటం

పార్లమెంటరీ వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది తొలిసారి లోక్‌సభ ప్రతిపక్ష నేతకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని తెలిపారు. లోక్‌సభ లో ప్రసంగం ప్రారంభించగానే అడ్డుకున్నారని, తన మాట వినిపించనివ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలు, జాతీయ భద్రత, ప్రజాస్వామ్య వ్యవస్థ అంశాల్లో కేంద్రం బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలు ముందుకు రావొద్దని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

# చైనా జే-20కి చెక్...

భారత వాయుసేన (ఐఏఎఫ్) తన సామర్థ్యాన్ని మరింత పటిష్టం చేసుకునే దిశగా కీలక యోచనలు చేస్తోంది. ఇటీవలే జరిగిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ 'సుఖోయ్ ఎస్‌యూ-57' కొనుగోలుపై రక్షణ వర్గాల్లో చర్చలు మళ్లీ ఊపందుకున్నాయి. చైనా, పాకిస్థాన్ నుంచి ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ అత్యాధునిక యుద్ధ విమానాలను సమకూర్చుకోవాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే, వాయుసేన సుమారు 40 ఎస్‌యూ-57 జెట్లను ఆర్డర్ చేసే అవకాశం ఉందని సమాచారం. గత ఏడాది పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ వాయుసేనతో జరిగిన గగనతల పోరాటాలు భారత రక్షణ వ్యూహకర్తలకు కొత్త పాఠాలు నేర్పాయి. ఆధునిక యుద్ధ తంత్రంలో ఫైటర్ జెట్లు నేరుగా తలపడే డాగ్‌ఫైట్ కన్నా, శత్రువు కంటపడకుండా దాడి చేసే స్టెల్త్ టెక్నాలజీకే ప్రాధాన్యత పెరిగిందని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో, రాడార్లకు చిక్కని ఐదో తరం యుద్ధ విమానాల ఆవశ్యకతను ఐఏఎఫ్ గుర్తించింది. ఇప్పటికే చైనా జే-20 పేరుతో సొంతంగా స్టెల్త్ ఫైటర్‌ను అభివృద్ధి చేసింది. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ పాకిస్థాన్‌కు కూడా అందే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో, భారత్ వేగంగా స్పందించాల్సిన అవసరం ఏర్పడింది.



### ఎస్‌యూ-57 ప్రత్యేకతలు ఏంటి?

రష్యా అభివృద్ధి చేసిన ఎస్‌యూ-57 ఒక శక్తివంతమైన ఐదో తరం మల్టీరోల్ స్టెల్త్ ఫైటర్. శత్రు రాడార్లను ఏమార్చేలా ప్రత్యేకమైన ఎర్‌ఫ్రేమ్ డిజైన్, రాడార్ తరంగాలను శోషించుకునే మెటీరియల్స్‌తో దీనిని నిర్మించారు. సూపర్‌క్రూయిజ్ సామర్థ్యం (ఆఫ్టర్‌బర్నర్ అవసరం లేకుండానే సూపర్‌సానిక్ వేగంతో ప్రయాణించడం), అడ్వాన్స్‌డ్ సెన్సార్ ఫ్యూజన్ వంటి అత్యాధునిక ఫీచర్లు ఇందులో ఉన్నాయి. గగనతలం నుంచి గగనతలానికి, భూమిపైకి క్షిపణులను ప్రయోగించే సత్తా దీని సొంతం.

### మధ్యంతర పరిష్కారంగానే..

భారత్ సొంతంగా 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్' (ఏఎంసీఏ) పేరుతో ఐదో తరం ఫైటర్ జెట్‌ను అభివృద్ధి చేస్తోంది. అయితే దీని తొలి ప్రయోగాత్మక ఫ్లైట్ 2028-29లో జరిగి, 2035 నాటికి గానీ వాయుసేనలోకి పూర్తిస్థాయిలో చేరే అవకాశం లేదు. ఈ సుదీర్ఘ కాలంలో ఏర్పడే వ్యూహాత్మక అంతరాన్ని పూడ్చడానికే ఎస్‌యూ-57 జెట్లను ఒక 'బ్రిడ్జింగ్' పరిష్కారంగా భారత్ చూస్తోంది. గత ఏడాది జరిగిన ఏరో ఇండియా 2025లో రష్యా ఈ విమానాన్ని ప్రదర్శనకు ఉంచింది. అయితే, ప్రస్తుతానికి ఈ కొనుగోలుపై ఎలాంటి అధికారిక ఒప్పందం జరగలేదని, కేవలం చర్చల దశలోనే ఉందని రక్షణ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

## శ్రీకాకుళం డయేరియా ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, రక్షణ న్యూస్

శ్రీకాకుళం నగరంలో డయేరియా కేసులు నమోదు కావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఘటనపై ఆయన రోజులో రెండు సార్లు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, క్షేత్రస్థాయిలో అందుతున్న వైద్య సేవలు, పరిస్థితులను ఆరా తీశారు. రోడ్డు మరమ్మతుల పనుల కారణంగా డయేరియా వ్యాప్తి చెందిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనలో ఇప్పటివరకు మొత్తం 65 మంది వివిధ ఆసుపత్రుల్లో చేరినట్లు తెలిపారు. వారిలో ఎనిమిది మంది చికిత్స అనంతరం డిశ్చార్జ్ కాగా, ప్రస్తుతం 55 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని వివరించారు. శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రిలో 30 మంది, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి (జీజిహెచ్)లో 11 మంది, జెమ్స్ ఆసుపత్రిలో ఆరు మంది, యూపీహెచ్‌సీలో నలుగురు, మెడికవర్ ఆసుపత్రిలో ఒకరు, ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లో ముగ్గురు బాధితులు చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. మిగిలిన 53 మంది ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని? తెలిపారు. డయేరియా ప్రభావంపై నగరంలో నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి సర్వే వివరాలను కూడా సీఎం తెలుసుకున్నారు. ఈ సర్వేలో భాగంగా డయేరియా లక్షణాలు ఉన్న మరో 79 మందిని గుర్తించినప్పటికీ, వారి పరిస్థితి ఆందోళనకరంగా లేదని, ఆసుపత్రిలో చేర్చాల్సిన అవసరం లేదని డాక్టర్లు నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. వారికి ఇంటివద్దే అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. డయేరియా బాధితులందరికీ అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా వెంటిలేటర్‌పై ఉన్న ఇద్దరి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వ్యాధి మరింత ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీటి కాలుష్యం జరగకుండా క్లోరినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, మురుగునీటి కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే ప్రజలు భయాందోళనకు గురికాకుండా అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి బాధితులకు ధైర్యం చెప్పాలని జిల్లా అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

## అమెరికా అతిపెద్ద యుద్ధనౌకలో వింత కష్టాలు...

మధ్యప్రాచ్యంలో ఇరాన్‌తో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ, అమెరికా తన సైనిక శక్తిని పెద్ద ఎత్తున మోహరిస్తోంది. అయితే, ఈ కీలక సమయంలో ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత ఖరీదైన విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఊహించని సమస్యలతో సతమతమవుతోంది. యుద్ధ సన్నాహాల కంటే ఎక్కువగా.. నౌకలోని మరుగుదొడ్ల వ్యవస్థ విఫలమవడం సుమారు 5,000 మంది సిబ్బందికి నరకం చూపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో, మధ్యప్రాచ్యంలో సైనిక శక్తిని ప్రదర్శించేందుకు ఈ నౌకను రంగంలోకి దించారు. గత ఏడాది జూన్‌లో సముద్రంలోకి వచ్చిన ఈ నౌక మోహరింపును ఇప్పటికే రెండుసార్లు పొడిగించారు. దీంతో సిబ్బంది దాదాపు 8 నెలలుగా సముద్రంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణంగా శాంతికాలంలో ఆరు నెలలకు మించి డెప్లాయ్‌మెంట్ (మోహరింపు) ఉండదు. ఇది మరో 11 నెలల వరకు కొనసాగితే, అమెరికా నేవీ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన నిరంతర డెప్లాయ్‌మెంట్‌గా రికార్డు సృష్టిస్తుందని రిటైర్డ్ రియర్ అడ్మిరల్ మార్క్ మాంట్‌గోమరీ వాల్ స్ట్రీట్ జర్నల్‌కు తెలిపారు. సుమారు 13 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.1 లక్షల కోట్లు) భారీ వ్యయంతో నిర్మించిన ఈ నౌకలో ఏర్పాటు చేసిన వాక్యూమ్ ఆధారిత ప్లంబింగ్ వ్యవస్థే ప్రధాన సమస్యగా మారింది. ఇందులో దాదాపు 650 టాయిలెట్లు ఉన్నాయి. ఏదైనా ఒక టాయిలెట్‌లో సమస్య వస్తే, ఆ సెక్షన్‌లోని అన్ని టాయిలెట్లు పనిచేయకుండా పోతున్నాయి. టీ-షర్టులు, తాళ్లు వంటి వస్తువులు పైపుల్లో ఇరుక్కుపోవడం, కొన్నిసార్లు టాయిలెట్ విడిభాగాలు ఊడిపోవడం వంటి కారణాలతో ఈ వ్యవస్థ తరచూ మొరాయిస్తోంది. జనవరిలో ఎన్‌పీఆర్ రిపోర్ట్ ప్రకారం, ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యాయని తెలుస్తోంది. ఈ సాంకేతిక సమస్యల పరిష్కారానికి నావికా సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. లీక్‌లను అరికట్టేందుకు కొందరు సిబ్బంది రోజుకు 19 గంటల వరకు పనిచేస్తున్నట్లు సమాచారం. డెప్లాయ్‌మెంట్ గడువును పదేపదే పొడిగించడంతో సిబ్బంది శారీరకంగా, మానసికంగా తీవ్ర అలసటకు గురవుతున్నారు. నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండటం వారిని మరింత కుంగదీస్తోంది. నౌక కదలికలను రహస్యంగా ఉంచే 'ఘోస్ట్ మోడ్' కారణంగా బయటి ప్రపంచంతో సంప్రదింపులు కూడా పరిమితమయ్యాయి. ఈ ఒత్తిడితో విసిగిపోయిన కొందరు నావికులు, ఈ డ్యూటీ ముగిసిన వెంటనే నేవీని విడిచిపెట్టాలని భావిస్తున్నట్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌తో పాటు జెరాల్డ్ ఫోర్డ్ కూడా చేరడంతో రెండు విమాన వాహక నౌకలు మోహరించినట్లు అయింది. ఈ అంతర్గత సమస్యలు సిబ్బంది నైతిక స్థైర్యంపై ప్రభావం చూపుతున్నప్పటికీ, నౌక యుద్ధ సామర్థ్యంపై ఎలాంటి ప్రభావం లేదని అధికారులు చెబుతున్నారు.

## 'జయలలిత జయంతికి గుడ్‌న్యూస్'

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి వేళ ఆమె స్నేహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ కీలక ప్రకటన చేశారు. జయలలిత జయంతి వేడుకలకు ముందు శుభవార్త వస్తుందని వ్యాఖ్యానించారు. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన నేపథ్యంలో శశికళ కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శశికళ తాజాగా చేసిన వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. జయలలితకు నివాళులర్పించిన అనంతరం శశికళ చేసిన వ్యాఖ్యలు తాను కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నానని ఆమె పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్లు అయ్యింది. ఫిబ్రవరి 24 (మంగళవారం) తమిళనాడు మాజీ సీఎం జయలలిత జయంతి. ఈ క్రమంలో శశికళ అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎంజీ రామచంద్రన్, జయలలిత స్మారక మందిరాల వద్ద పుష్పగుచ్ఛాలు పెట్టి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తన రాజకీయ అరంగేట్రం గురించి శశికళ పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. "ఈ రోజు అమ్మ (జయలలిత) పుట్టినరోజు సందర్భంగా ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆ కార్యక్రమంలో శుభవార్త వస్తుంది. " అని వ్యాఖ్యానించారు.

### పార్టీ నుంచి సస్పెండ్

మాజీ సీఎం జయలలిత 2016 డిసెంబర్‌లో మరణించడంతో, అప్పట్లో ఆమె నెచ్చెలి శశికళ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. అంతలోనే శశికళ అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్లారు. దీంతో ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాగా, తమిళనాడులో మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఫిబ్రవరి నెల ప్రారంభంలో శశికళ చెన్నైలో తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శశికళ సన్నిహితుడు అరసన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము చిన్నమ్మతోనే (శశికళ) ఉన్నామని, ఆమెకు అండగా నిలుస్తామని అరసన్ అన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో శశికళ ఏ నిర్ణయం తీసుకున్నా తాము అందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. తాను చిన్నప్పటి నుంచి వీకే శశికళ, ఆమె భర్త నటరాజన్‌కు చాలా నమ్మకమైన మద్దతుదారుడినని చెప్పారు. ఎప్పటికీ అలాగే కొనసాగుతానని స్పష్టం చేశారు. అయితే 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు శశికళ తన మద్దతుదారులతో సమావేశం అవ్వడం, ఇతర పరిస్థితులను బట్టి ఆమె కొత్త పార్టీ పెట్టనున్నారని వార్తలు వినిపించాయి. అందుకు తగ్గట్లుగానే జయలలిత జయంతి నాడు శశికళ పరోక్ష సంకేతాలు ఇచ్చారు.

### మోదీ, అమిత్ షా నివాళులు

మరోవైపు, జయలలిత 78వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్రహోం మంత్రి అమిత్ షా ఆమెకు నివాళులర్పించారు. జయలలిత సేవలను గుర్తు చేసుకున్నారు. తమిళనాడులో సంక్షేమ ఆధారిత పాలన, మహిళా సాధికారత, సమగ్రాభివృద్ధికి పాటుపడిన ఆకర్షణీయమైన నాయకురాలు, అత్యుత్తమ పాలనాదక్షత కలిగిన నేత జయలలిత అని మోదీ కొనియాడారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'జయలలితను ఆమె జయంతి సందర్భంగా స్మరించుకుంటున్నాం. ఆకర్షణీయ నాయకురాలిగా, అత్యుత్తమ పాలనాదక్షత కలిగిన నేతగా ఆమె ప్రజల హృదయాల్లో చోటు



# ఆ సంఘటన నన్ను ఎంతగానో గాయపరిచింది..

తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుస విజయాలతో దూసుకుపోతుంది యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. బ్లాక్ బస్టర్ హిట్ 'కార్తికేయ-2' షూటింగ్ సమయంలో జరిగిన ఒక సంఘటన తనను ఎంతగా కలచివేసిందో ఆమె వివరించారు. 'కార్తికేయ-2' షూటింగ్ సమయంలో సెట్స్‌లో ఒక మేకపిల్ల ఉండేదని, దానితో తాను ఎంతో ఇష్టంగా ఆడుకునేదాన్ని అని అనుపమ తెలిపారు. "ఆ మేకపిల్లతో గడపడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చేది. అయితే ఒకరోజు షూటింగ్ గ్యాప్‌లో మాకు మటన్ బిర్యానీ వడ్డించారు. నేను తింటున్న సమయంలో నా అసిస్టెంట్ నా దగ్గరకు వచ్చి నవ్వుతూ.. 'మేడం, మీరు ఇప్పుడు తింటున్నది మీరు ఇందాక ఆడుకున్న మేకపిల్లనే' అని చెప్పాడు" అంటూ ఆనాటి చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నారు. అసిస్టెంట్ చెప్పిన మాట వినగానే తాను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానని, వెంటనే వాంతులు చేసుకున్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘటన తనను ఎంతగా గాయపరిచిందంటే.. అప్పటి నుంచి తాను మటన్ ముట్టుకోవడమే మానేశానని తెలిపారు. దాదాపు కార్తికేయ-2 సమయం నుంచి ఇప్పటి వరకు మటన్ జోలికి వెళ్ళలేదని, అయితే ఇటీవల కాలంలోనే మళ్ళీ నెమ్మదిగా తినడం ప్రారంభించానని ఆమె వెల్లడించారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వారంతా.. మూగజీవాల పట్ల ఆమెకు ఉన్న ప్రేమే ఆమెను అన్ని ఏళ్లపాటు మటన్‌కు దూరంగా ఉంచిందని, అనుపమ సున్నిత మనస్తత్వాన్ని మెచ్చుకుంటున్నారు. ఇక అనుపమ సినిమాల విషయానికొస్తే.. ఇటీవల 'లాక్‌డౌన్' సినిమాతో అలరించిన అనుపమ, ప్రస్తుతం 'క్రేజీ కళ్యాణం' అనే సినిమాలో నటిస్తున్నారు.



# అత్యంత తక్కువ టికెట్ ధరకు హే బల్‌వంత్

కొన్ని సంవత్సరాల వెనక్కి వెళ్లినట్లయితే తెలుగు సినిమా పరిశ్రమలో టికెట్ ధరలు కాస్త తక్కువగా ఉండేవి. అలాగే ఓటీటీల వెసులుబాటు కూడా లేదు.దానితో పెద్ద ఎత్తున ఫ్యామిలీ ఆడియన్స్, యూత్, కామన్ ప్రేక్షకులు కూడా సినిమాను థియేటర్కు వెళ్లి చూసేవారు. దానితో కాస్త మంచి సినిమాలకు సూపర్ వసూళ్లు దక్కడం, యావరేజ్ సినిమాలు కూడా బ్రేక్ ఈవెన్ ను కంప్లీట్ చేసుకునేవి. కానీ కొన్ని సంవత్సరాలుగా స్టార్ హీరోల సినిమాలకు టికెట్ ధరలను భారీగా పెంచుతున్నారు. అలాగే కొంచెం క్రేజ్ ఉన్న సినిమాల టికెట్ ధరలను కూడా అలాగే పెంచేస్తున్నారు. ఇక సినిమా విడుదల అయ్యి నెల తిరగకుండానే ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. దానితో చాలామంది ప్రేక్షకులు అంత డబ్బు పోసి సినిమాను థియేటర్కు వెళ్లి చూడాలా? నెల రోజుల్లోనే ఇంట్లో అంతా కలిసి చూడొచ్చు అనే అభిప్రాయానికి వచ్చేసారు. దానితో స్టార్ హీరోల సినిమాలకు బ్లాక్బస్టర్ టాక్ వచ్చిన సందర్భంలో, మరికొన్ని సినిమాలకు మాత్రమే పెద్ద ఎత్తున కలెక్షన్లు వస్తున్నాయి. చాలా చిత్రాలు బ్రేక్ ఈవెన్ కావడం కష్టంగా మారింది. దానితో చిన్న సినిమాల నిర్మాతలు కొత్త స్ట్రాటజీతో ముందుకు వస్తున్నారు. తమ సినిమాను అత్యంత తక్కువ టికెట్ ధరకు చూడండి అని ఆఫర్లు ఇస్తున్నారు. తాజాగా ఇదే ఫార్ములాను సుహాస్, శివానీ నాగారం జంటగా గోపి అచ్చర దర్శకత్వంలో రూపొందిన హే బల్‌వంత్ మూవీ యూనిట్ కూడా ఫాలో అయ్యింది. తాజాగా ఈ మూవీ బృందం వారు 99 రూపాయలకే రెండు తెలుగు రాష్ట్రాల్లోని మేజర్ స్క్రీన్లలో ఈ సినిమాను ప్రదర్శిస్తున్నట్లు, తక్కువ టికెట్ ధరకు ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేయండి అని ఆఫర్ను ఇచ్చారు. మరి ఈ ఆఫర్ సినిమా వసూళ్లపై ఏ స్థాయి ప్రభావాన్ని చూపిస్తుందో చూడాలి.



# ఆ సమయంలో మళ్ళీ ఎవరినైనా నమ్ముతానని అనుకోలేదు..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేశారు. గత కొద్ది కాలంగా ఇండస్ట్రీకి దూరంగా ఉన్న ఆమె 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.ఈ మూవీ పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో.. తాజాగా, ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె తన వ్యక్తిగత జీవితం గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా నాగచైతన్యతో విడాకుల తర్వాత తన పరిస్థితి ఎలా ఉండేదో, రాజ్ నిడిమోరు పరిచయం తనను ఎలా మార్చిందో ఆమె వివరించారు. "నేను విడాకులు తీసుకున్న సమయంలో చాలా కుంగిపోయాను. నా చుట్టూ ఒక గోడ కట్టుకుని ఎవరినీ రానివ్వలేదు. మళ్ళీ ఎవరినైనా నమ్ముతానని లేదా వేరొకరిపై ఆధారపడతానని అస్సలు ఊహించలేదు. కానీ, రాజ్ అందించిన ప్రేమను, స్నేహాన్ని స్వీకరించే మనస్తత్వం నాకు ఉండటం నా అదృష్టం. రాజ్ లాంటి వ్యక్తి నా జీవితంలో ఉండటం వల్ల నేను ఇప్పుడు ఒక మంచి మనిషిగా మారాను" అని సమంత ఎమోషనల్ అయ్యారు. తనలో వచ్చిన ఈ సానుకూల మార్పును అందరూ గమనిస్తున్నారని, తన పాత స్నేహితురాలు కూడా ఈ విషయాన్ని నేరుగా చెప్పారని సమంత పేర్కొన్నారు. విడిపోయిన ప్రారంభ రోజుల్లో చాలా లో-ఫేజ్‌లో ఉన్న తనకు, రాజ్‌తో ఏర్పడిన స్నేహం జీవితం పట్ల ఉన్న నమ్మకాన్ని మార్చేసిందని ఆమె వెల్లడించారు. 2021లో 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' సెట్స్‌లో వీరిద్దరికీ పరిచయం ఏర్పడగా, అది కాలక్రమేణా బలపడి గతేడాది వివాహ బంధానికి దారితీసింది. పెళ్లి చేసుకుని వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఈ జంట తమ పర్సనల్ లైఫ్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు.



# అన్నం పెట్టే ఇండస్ట్రీని గౌరవించండి

టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలిగి, ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ బిజీగా ఉన్న రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని నటుల బాధ్యతలపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.ఒక నటిగా తన వృత్తి పట్ల తనకు ఎంత గౌరవం ఉందో చెబుతూ, భాష తెలియకుండా నటించే వారిపై ఆమె పరోక్షంగా చురకలు వేశారు. చాలామంది నటీనటులు ఇతర భాషల్లో నటించేటప్పుడు డైలాగులకు బదులుగా కేవలం అంకెలు (1, 2, 3) లేదా 'అఆ' లు చెబుతూ మేనేజ్ చేస్తుంటారు. దీనిపై రకుల్ స్పందిస్తూ.. "నేను స్వతహాగా మోసగత్తెను కాదు. సెట్స్‌లో 1, 2, 3 లేదా అ ఆ అని చెప్పి నా లైన్లను నేను పూర్తి చేయలేను. ఒక పరిశ్రమ మనకు అన్నం పెడుతున్నప్పుడు మనం దాన్ని గౌరవించాలి. మనకు ఇంత ప్రేమను ఇస్తున్నప్పుడు.. కనీసం ఆ భాషను నేర్చుకోవడం మనం చేయాల్సిన కనీస బాధ్యత" అని ఆమె స్పష్టం చేశారు. తనకు ఎలాంటి పాత్రలు చేయాలని ఉందనే విషయంపై రకుల్ మాట్లాడుతూ.. "ఒక నటిగా నాకు విభిన్నమైన, ముఖ్యంగా నెగటివ్ రోల్స్ చేయడమంటే చాలా ఇష్టం. అది చాలా ఆకర్షణీయంగా అనిపిస్తుంది. అయితే ఇందులో ఒక సమస్య ఉంది. మీరు ఒకసారి నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపిస్తే, మేకర్స్ మిమ్మల్ని మళ్ళీ 'గర్ల్ నెక్ట్ డోర్' (పక్కింటి అమ్మాయి) పాత్రల్లో చూడటానికి ఇష్టపడరు" అని తన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక నటిగా పరిపూర్ణత కోసం తాను పడే తపనను వివరించిన రకుల్, భాష ఏదైనా సరే అందులో లీనమై నటించడమే తన విజయ రహస్యమని చెప్పుకొచ్చారు.

Printed and Published by G. Narendra, Editor,1-4-55, Bapatla, Bapatla District.Phone: 8185 997507...